ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 30
సంచిక : 163
పేజీలు : 3

గురువారం, మార్చి 05, 2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ



## ప్రజా పాలన ప్రణాళిక

**-పాఠశాలలు, వసతి గృహాలపై నిరంతర పర్యవేక్షణ**

**-జిల్లా కలెక్టర్ అంకిత్**

**టి మీడియా, మార్చి 4,భద్రాద్రి కొత్తగూడెం :**జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టనున్న 99 రోజుల కార్యాచరణను సమర్థవంతంగా, సమన్వయంతో అమలు చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి ముందుగా జిల్లా అధికారులతో సమగ్ర దిశానిర్దేశం నిర్వహించారు. అనంతరం జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీఓలు, మున్సిపల్ కమిషనర్లు, వార్డు అధికారులు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మార్చి 6 నుండి జూన్ 12 వరకు వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. మార్చి 6 నుండి మార్చి 15 వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాలలో ఫైళ్ల పరిష్కరణ అంశంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యాలయాల పరిశుభ్రత, పెండింగ్ ఫైళ్ల వేగవంతమైన పరిష్కారం, రికార్డుల సక్రమ నిర్వహణ, ప్రజలకు సమయానుకూల సేవలందించడం లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో తడి--పొడి చెత్త వేరు సేకరణ, పిచ్చి మొక్కల తొలగింపు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త నిర్మూలన, ప్రభుత్వ భవనాల శుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు.ఏప్రిల్ 6 నుండి ఏప్రిల్ 11 వరకు ఆరోగ్యం --ఆరోగ్యకరమైన ప్రారంభాలు, ఆశాజనకమైన భవిష్యత్తులు అంశంపై ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు, వైద్య పరీక్షలు, గర్భిణీలు మరియు చిన్నారులకు ప్రత్యేక పర్యవేక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు.ఏప్రిల్ 13 నుండి ఏప్రిల్ 18 వరకు సురక్షితంగా చేరుకోండి కార్యక్రమం హోం రవాణా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని తెలిపారు. రోడ్డు భద్రతపై అవగాహన, ట్రాఫిక్ నియమాల కఠిన అమలు, హెల్మెట్--సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.ఏప్రిల్ 20 నుండి ఏప్రిల్ 25 వరకు సంక్షేమం అంశంపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు , ఇందిరమ్మ ఇల్లు పథకం అమలు స్థితిపై సమీక్షలు నిర్వహించి, లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## చింతూరులో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్



**చింతూరు,టీ.మీడియా,మార్చి4,చింతూరు:**చింతూరు పోలీసులు బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పోలీస్ ఉన్నతాధికారులైన డిజిపి హరీష్ గుప్తా ( ఐపీఎస్), పోలవరం జిల్లా ఎస్పి అమిత్ బర్దర్ ( ఐపీఎస్), ఎస్పి బొడ్డు హేమంత్ ( ఐపీఎస్), సిఐ గోపాలకృష్ణ నేతృత్వంలో చింతూరు ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో చింతూరులోని బీసీ కాలనీ లో వజ్ర పహార్ కార్యక్రమంలో భాగంగా కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ప్రతి ఇంటికి వెళ్లి ఆధార్ కార్డులు సేకరించారు. ఇంట్లో ఉండే జనాభా ఎంత ? ప్రతి ఇంట్లో అద్దెకు ఎవరు ఉంటున్నారు ? మొదలగు వివరాలు సిబ్బందితో సేకరించారు. చత్తీస్గఢ్, ఒరిస్సా రాష్ట్రాల సరిహద్దు పోలీస్ స్టేషన్ అవడంతో, గంజాయి అక్రమ రవాణా, కొత్త వ్యక్తుల గురించి ఆరా తీశారు. అలాగే సి బుక్కు లేని ద్విచక్ర, ఆటో, తదితర వాహనాలు గురించి వివరాలు సేకరించారు. డ్రోన్ కెమెరాతో ఏరియల్ సర్వే నిర్వహించారు. కొత్త అపరిచిత వ్యక్తుల వివరాలు, వేలి ముద్రలు కూడా సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమేష్ తో పాటు,ఎ ఎస్ఐ దొర,మల్లికార్జున్,పోలీసు సిబ్బంది, సిఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వెంకటరెడ్డి సేవలు మరువలేనివి

**వర్ధంతి సభలో**

**ఎమ్మెల్యే కోరం కనకయ్య**



**టీ మీడియా మార్చి 4, కామేపల్లి** :దివంగత నేత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రివర్యులు రామ్ రెడ్డి వెంకట్ రెడ్డి10 వర్ధంతికార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ ఈ ప్రాంతంలో బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి గా పేదలపాటి పెన్నిధిగా పేరు తెచ్చుకొని నమ్మిన కాంగ్రెస్ పార్టీలో ఎన్ని ఇబ్బందులు వచ్చినా పార్టీని వదలకుండా తుది శ్వాస వరకు కాంగ్రెస్ పార్టీలో సేవ చేశారని నమ్మిన కాంగ్రెస్ కార్యకర్తలు ను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారని ఈ సందర్భంగా

మిగతా 3లో

## తమ్మినేనిపై ఎందుకీ విద్వేషం



**టీ మీడియా, మార్చి 4, ఖమ్మం**

సిపిఎం పార్టీకి ఎంతో ఘనమైన త్యాగాల చరిత్ర ఉంది. ఎన్నో ప్రజాపోరాటాలకు నాయకత్వం వహించి విజయాలు సాధించింది. ఖమ్మం జిల్లాలో సిపిఎం పార్టీ నేపథ్యం లేని వారు ఉండరేమో.!!

ఎన్ని పార్టీలు అధికారంలోకి వచ్చిన ఖమ్మంలో సిపిఎంను ప్రజల నుండి దూరం చేసింది లేదు.

అలాంటి సిపిఎం ను ఖమ్మం జిల్లాలో బలమైన పార్టీగా నిర్మించడంలో పాతతరం నేతలు మంచికంటి,బోడెపూడి, చిర్రావూరి,రావెళ్ళ,ఏలూరి,కెఎల్, పర్సా,లాంటి మహానుభావులందరికి ఎంత పాత్ర ఉందో తమ్మినేని కి అంతే చరిత్ర ఉంది. కానీ ఈరోజు తమ్మినేనిపై ఆవాకులు, చవాకులు, పేలుతున్నారు. కొంత మంది ఈ విష,విద్వేష ప్రచారంను ఆనందిస్తూ మహానందం పొందుతున్నారు.

ఖమ్మం జిల్లా రైతులకోసం "మహాప్రస్థానం" పేరుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి జలాలను ప్రతిరైతుకు ఉపయోగ పడాలని కాళ్ళకు బొబ్బలు వచ్చిన, నడవలేకున్నా సిపిఎం ఙ ప్రజల కోసం పాదయాత్ర చేసిన చరిత్ర తమ్మినేనికి సొంతం.

ఈరోజు ఆస్థిత్వం పేరుతో ఆయనపై జరుగుతున్న దాడిని ,మీడియాకు లీకులు ఇస్తూ "అభిశంషన" అంటూ తెగ ఆనందం పొందుతున్నారు. కానీ ఎస్సీ, ఎస్టీలను మనుషులగా గుర్తించని జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాల దగ్గర వెళ్ళి వారి భోజనం తింటూ, వాళ్ళ ఇండ్లలో పడుకుంటూ వారికోసం సైకిల్ యాత్ర చేసి దేవుడు గుళ్ళో ప్రవేశం చేయించాడు. క్రింద వర్గాల వివక్ష వ్యతిరేకంగా పెద్ద కులంలో పుట్టి అణగారిన వర్గాల కోసం పని చేయడం తమ్మినేని తప్పా.?

పుట్టుకను నిర్ణయించుకునే హక్కు ఉంటే దళిత కుటుంబంలో పుట్టేవాడినని ప్రకటించిన నైజం తమ్మినేనిది !! తెలంగాణ రాష్ట్రంలో అణాగారిన వర్గాలు అభ్యున్నతికి పార్టీ నిర్ణయిస్తే నాటి 31 జిల్లాలో 'మహాజన పాదయాత్ర" చేసినవాడు తమ్మినేని ,ఆనాడు తమ్మినేని క్షేత్ర స్థాయిలో వెళ్ళి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే వాటి ఆధారంగా వచ్చిన పథకాలు ఎన్నో ఉన్నాయి.

సిపిఎం పార్టీకి నిర్మాణమే ఆయుధం పార్టీకి భిన్నంగా వ్యవరించిన వారు ఎవరైనా సరే వ్యక్తులు కంటే పార్టీయే ప్రాధాన్యత ఇచ్చే గోప్ప పార్టీ ,ముఖ్యమంత్రి గా చేసిన నృపేన్ చక్రవర్తి, లోక్ సభ స్పీకర్ సోమనాథ్ చటర్జీ లాంటి నేతలనే ప్రక్కన పెట్టిన పదునైన నిర్మాణం కల్గినది. అలాంటి పార్టీలో ఎదైనా సమస్యలు ఉంటాయి. ఎందుకంటే ఇక్కడ అభిప్రాయాలు చెప్పుకునే హక్కులు, స్వేచ్ఛ ఉంటుంది. తమ్మినేనిపై వచ్చినవి ఎమైనా సరే పై కమిటీ సూచనలు ,వాటిని అంతర్గత పద్దతిలో చర్చించి సరిచేసుకోవాల్సినవే. కానీ ఇంత విద్వేష పూరితంగా దాడి చేస్తున్నారంటేనే నిజంగా ప్రజా నాయకుడు తమ్మినేని !!

## పశువైద్యశాలలో వైద్యం కరువు

**తీరు మార్చుకోని వైద్యురాలు**

**మూగజీవాలకు శాపంగా**

**కారేపల్లి పశువైద్యశాల**



**టీ మీడియా, మార్చి 4, సింగరేణి (కారేపల్లి):**
ఖమ్మం జిల్లా సింగరేణి మండల కేంద్రంలోని కారేపల్లి పశువైద్యశాలలో వైద్య సేవలు అందక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యురాలు మూగజీవాల పాలిట శాపంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు ఫిర్యాదులు వచ్చినా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.బుధవారం చీమలవారి గూడెంకు చెందిన ఓ రైతు తన ఆవు మేత మేయడం లేదని ఉదయం సుమారు 8 గంటల సమయంలో పశువైద్యశాలకు తీసుకువచ్చాడు. అయితే ఆస్పత్రికి తాళం వేసి ఉండటంతో అక్కడే గంటల తరబడి వేచి చూశాడు. వైద్యులు రాకపోవడంతో వైద్యురాలు డా "ఇందిరాతో చరవాణిలో సంప్రదించగా, చీమలవారి గూడెం నా పరిధిలో లేదు. ఇక్కడికి ఎందుకు తీసుకొచ్చారు అంటూ నిర్లక్ష్యంగా స్పందించినట్లు రైతు వాపోయాడు.నాలుగు కిలోమీటర్ల దూరం నుండి నడుచుకుంటూ ఆవును తీసుకువచ్చినా పట్టించుకునే నాథుడు లేకపోవడం బాధాకరమని, ఇలాంటి ఘటనలు గతంలోనూ పునరావృతమయ్యాయని రైతులు తెలిపారు. టీ మీడియా ప్రతినిధి వైద్యురాలిని సంప్రదించగా, ఆస్పత్రికి సెలవు లేదని, బంధువుల ఇంటికి వచ్చామని తెలిపారు. ఇన్‌చార్జిగా ఎవరినైనా నియమించారా అని ప్రశ్నించగా, ఎవ్వరు లీవ్ కూడా పెట్టలేదని నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చినట్లు సమాచారం.ఆస్పత్రిలో విధుల్లో ఉన్న మరో ఇద్దరు వైద్యులను సంప్రదించగా, తాము సెలవులో లేమని చెప్పడం గందరగోళానికి దారి తీసింది. చివరకు ఉదయం 8 గంటలకు ఆస్పత్రి వద్దకు వచ్చిన రైతుకు మధ్యాహ్నాం 2 గంటల సమయంలో ఒక వైద్యురాలు వచ్చి వైద్యం చేసిన ఘటన చోటుచేసుకుంది. గతంలో కూడా ఈ పశు వైద్యశాలలో అనేక ఘటనలు జరిగి వార్తలలో నిలిచి నా కూడా వైద్యురాలుపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పై రైతులు ఆశ్చర్యానికి గురి అవుతున్నారు.వైద్య సేవలు అందక మూగజీవాలు ఇబ్బందులు పడుతున్నాయని, బాధ్యులపై తక్షణ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, ఈ విషయాన్ని పై అధికారులు ఎవరు చర్యలు తీసుకోకపోతే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని రైతులు వాపోతున్నారు.



## ఇఫ్తార్ విందులో బిఆర్ఎస్ నాయకులు

### అధిక సంఖ్యలో పాల్గొన్న ముస్లిం సోదరులు

**టి మీడియా, మార్చి 4,అశ్వాపురం:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వాపురం మండల కేంద్రంలోని జామా మసీదులో బుధవారం రంజాన్ పండుగను పురస్కరించుకొని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ( ఫ్రూట్స్)ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మతసామ్రసానికి ప్రతీక అయిన ఈ పవిత్ర రంజాన్ మాసంలో ఖురాను అవతరించిన శుభ సందర్భంగా ముస్లిం సోదరులు రంజాన్ మాసాన్ని అత్యంత పవిత్రంగా భక్తిశ్రద్ధలతో కటోరమైన ఉపవాస దీక్షను చేపడుతారు. ఈ దీక్ష వలన ఎదుటి వారి ఆకలి బాధను తెలుసుకొని వారికి సహాయ,సహకారాలు, అందించడంతో పాటు, వీరి వీరి గా దానధర్మాలు చేయడం తోటి వారి పట్ల దయ, జాలి, కరుణ చూపించి మహమ్మద్ ప్రవక్త సూచించిన సద్ మార్గాలలో భాగంగా ఐదు పూటల నమాజు జకాత్ , ఫిత్రా, హజ్ యాత్ర వంటి పలు అంశాలను చేపట్టం వలన ఖురాను వినడం వలన ముస్లింలు మంచి ప్రవర్తనతో ఇతరుల పట్ల సోదర భావంతో మెలుగుతారని, కటోరమైన ఈ దీక్ష ఉదయం సహారి తో మొదలయ్యి సాయంత్రం ఇఫ్తార్ తో ముగిస్తారు. ఉపవాస దీక్షలో ప్రతి ఒక్క ముస్లిం సోదరుడు కనీసం మంచినీరు కూడా తాగకుండా ఉమ్మిని సైతం మింగకుండా అత్యంత భక్తి, శ్రద్ధలతో నియమ, నిబంధనలతో కఠోరమైన ఉపవాస దీక్షను నిర్వహిస్తారు. ఇంతటి పవిత్రమైన రంజాన్ మాసాన్ని ముస్లింలందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ముందుగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో.... బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్, సీనియర్ నాయకులు కందుల కృష్ణార్జునరావు, సూది రెడ్డి గోపిరెడ్డి, తూము రాఘవులు, భూక్య చందూలాల్, గద్దల రామకృష్ణ, తుర్రం సమ్మయ్య, దేవబోయిన మహేష్, కాట్రాజ్ రాంప్రసాద్, గజ్జి మనోజ్, జామా మసీద్ కమిటీ సభ్యులు, మత పెద్దలు, మత గురువులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.




## బాధ్యతాయుతంగా సేవలు అందించాలి

### -- ఎమ్మెల్యే జారె

**టి మీడియా, మార్చి 4,అశ్వారావుపేట:**ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రతీ ప్రజాప్రతినిధి తన పరిధిలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ, బాధ్యతా యుతంగా సేవలు అందించాలి, జవాబుదారీతనం, పారదర్శకత పాటించాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. నియోజకవర్గం కేంద్రం అయిన అశ్వారావుపేట లోని రైతు వేదిక లో బుధవారం ఏర్పాటు చేసిన రెండో విడత వార్డు సభ్యులు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామపంచాయతీ వ్యవస్థ గ్రామ అభివృద్ధికి కీలకం అని,మౌళిక వసతులు ప్రాథమిక అంశాల్లో వార్డు సభ్యుల పాత్ర ప్రాముఖ్యత ను వివరించారు.ప్రజలు ఇచ్చిన విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రతి ప్రజాప్రతినిధి ధర్మమని,ప్రజా అవసరాలకు అనుగుణంగా పనిచేస్తేనే గ్రామాలు సమగ్ర అభివృద్ధి సాధిస్తాయని పేర్కొన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాలంటే గ్రామాల్లో పటిష్టమైన నాయకత్వం అవసరమన్నారు.గ్రామాల్లో ఎదురయ్యే సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆత్మ(బీఎఫ్ఏసీ )చైర్మన్ సుంకవల్లి వీరభద్ర,ఎంపీడీవో అప్పారావు, ఎంపీఓ రామ కోటారెడ్డి,గ్రామపంచాయతీ కార్యదర్శులు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం పార్టీ నుండి బహిష్కరణ



**టి మీడియా, మార్చి 4,మోతె:** సిపిఎం పార్టీ ప్రతిష్టతకు భంగం కలిగించేలా అనైతిక చర్యకు పాల్పడిన సిపిఎం పార్టీ మోతె మండల కార్యదర్శి ములుకూరి గోపాల్ రెడ్డిని సిపిఎం పార్టీనుండి బహిష్కరిస్తున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుండి ఆయనకు సిపిఎం పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఆయన పాల్పడిన అనైతిక చర్య వల్ల పార్టీకి తీవ్ర నష్టం కలిగినట్టుగా భావిస్తున్నామన్నారు.

# మొక్క కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

### - పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలి

### సీపీఐ(ఎం) మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి



**టి మీడియా, మార్చి 4,బోనకల్ :** మధిర నియోజకవర్గ వ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, అకాల వర్షాల వలన దెబ్బతన్న మొక్కజొన్న రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఐ(ఎం) మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం లోని బోనకల్ మండల కేంద్రంలో గల వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల భవనంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సమావేశం బంధం శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం జరిగింది.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాల వలన మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. మధిర నియోజకవర్గ వ్యాప్తంగా మొక్కజొన్న పంట చేతికి వచ్చిందన్నారు. పది రోజుల క్రితం వరకు రూ. 2600 వరకు కొనుగోలు చేశారని తెలిపారు. ప్రైవేటు వ్యాపారులు రంగంలోకి దిగి ప్రస్తుతం రూ. 1500 నుంచి రూ. 1600 లకే కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. దీని వలన కూడా రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా మద్దతు ధర రూ. 2400 మార్కెఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అసలే అకాల వర్షాలు వలన చాలామంది రైతులు తీవ్రంగా నష్టపోయరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులు ఇష్టానుసారంగా కొనుగోలు చేస్తున్నారని, ప్రభుత్వమే మార్కెఫెడ్ ద్వారా కొనుగోలు చేయటం వలన ఎంతో కొంత రైతులకు లాభం చేకూరుతుందన్నారు. మధిర నియోజకవర్గ వ్యాప్తంగా అనేక గ్రామాలలో మొక్కజొన్న పంట చేతికి వచ్చిందన్నారు. ఎకరానికి ఒక్కొక్క రైతు రూ. 30 వేల వరకు, కౌలు రైతులు ఎకరానికి కౌలు, పెట్టుబడి కలిపి రూ. 50 వేల వరకు పెట్టుబడి పెట్టినట్టు తెలిపారు. అకాల వర్షాల వలన నేలమట్టమైన మొక్కజొన్న రైతులకు ఈ ఏడాది తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఈ ఏడాది వానాకాలంలో సాగుచేసిన పత్తి పంట అకాల వర్షాలు వల్లే పూర్తిగా దెబ్బతిని రైతులు దారుణంగా నష్టపోయారు అన్నారు. పత్తి పంట వలన నష్టపోయిన అన్నదాతలు మొక్కజొన్న పంట సాగు చేశారని అది కూడా అకాల వర్షాలు దెబ్బతిన్నది అన్నారు.ఈ ఏడాది అకాల వర్షాలు రైతులకు కన్నీటి కడగండ్లు మిగిల్చాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ప్రకృతి వైపరీత్యము వలన నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాల్సిన బాధ్యత లేదా అని ఆయన ప్రశ్నించారు. ఒకవైపు తమది రైతు ప్రభుత్వం అని పదేపదే చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం అకాల వర్షాల వలన దెబ్బతిన్న రైతులను ఎందుకు ఆదుకోవడం లేదో ప్రభుత్వం రైతులకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మార్కెఫెడ్ ద్వారా వెంటనే మధిర నియోజకవర్గ వ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, లేనియెడల సిపిఎం ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు.నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు లక్ష ఎకరాలలో మొక్కజొన్న పంట సాగు చేశారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా సీనియర్ నాయకులు చింతలచెరువు కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కిలారు సురేష్, మండల కమిటీ సభ్యులు గుగులోత్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

**టి మీడియా, మార్చి 4,జూలూరుపాడు:** పదేళ్ల పాఠశాల ప్రయాణం.. వెలకట్టలేని స్నేహాలు.. కన్నతండ్రిలా విద్యాబుద్ధులు నేర్పిన గురువులు.. ఇవన్నీ ఒక ఎత్తైతే, ఇప్పుడు ఆ గడప దాటి వెళ్తున్నామన్న బాధ మరో ఎత్తు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం, కాకర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం అత్యంత భావోద్వేగాల మధ్య జరిగింది. 9వ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఈ వీడ్కోలు సమావేశం కేవలం వేడుకగానే కాకుండా ఆత్మీయ కలయికగా మారింది. పాఠశాల ప్రాంగణంలో గడిపిన ప్రతి క్షణం విద్యార్థుల కళ్లముందు కదలాడాయి. తమను తీర్చిదిద్దిన ఉపాధ్యాయుల పాదాలకు నమస్కరిస్తూ విద్యార్థులు కృతజ్ఞతలు తెలుపుతున్నప్పుడు పలువురి కళ్లు చెమర్చాయి. ఉపాధ్యాయులు నేర్పిన పాఠాలు తమ జీవితాలకు వెలుగునిస్తాయంటూ విద్యార్థులు ఉద్వేగంగా ప్రసంగించారు.తరగతి గదిలో సందడి, ఆటస్థలంలో కేరింతలు, భోజనాలు పంచుకున్న రోజులను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు కౌగిలించుకుని వీడ్కోలు చెప్పుకున్నారు. రేపు పాఠశాల గంట మోగితే తాము ఇక్కడ ఉండమన్న ఆలోచన వారిని కలిచివేసింది. అయితే తమ సీనియర్ల భవిష్యత్ బంగారుమయంగా ఉండాలని 9వ తరగతి విద్యార్థులు ఆకాంక్షించి వారిని సాగనంపారు. వీడ్కోలు అంటే విడిపోవడం కాదు.. కొత్త శిఖరాలను అధిరోహించేందుకు చేసే మరో ప్రయాణం అని ఉపాధ్యాయులు విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సంజీవరావు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కళ్యాణి, ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, బి.సంపత్ కుమార్ పాల్గొన్నారు.

## విద్యుత్ 'లైన్‌మ్యాన్ దివాస్' వేడుకలు



**టి మీడియా, మార్చి 4,చుంచుపల్లి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం విద్యుత్ కార్యాలయంలో ఏఈ నరసింహారావు ఆధ్వర్యంలో లైన్‌మ్యాన్ దివాస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యుత్ రంగంలో ప్రాణాలకు తెగించి నిరంతరం సేవలు అందిస్తున్న ఫ్రంట్‌లైన్ యోధులైన లైన్‌మెన్‌ల సేవలను గుర్తించి వారిని గౌరవించడం లైన్‌మ్యాన్ దివాస్ ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఈ రంగస్వామి, ఏడీఈ హేమచంద్రబాబు హాజరై మాట్లాడారు. ప్రతి లైన్‌మ్యాన్ నిత్యం భద్రతా పరికరాలు ఉపయోగించుకుంటూ సురక్షితంగా పని చేయాలని సూచించారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నిరంతర విద్యుత్ సరఫరాకు లైన్‌మెన్ కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. అనంతరం పలువురు విద్యుత్ ఉద్యోగులను సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కత్తి శీను, జగదీష్ బాబు, టి.కిషన్ పాల్గొన్నారు.



## త్వరలో గిరి మాల్టు ప్రారంభం

### ఐటీడీఏ ఏపీవో డేవిడ్ రాజ్

**టి మీడియా, మార్చి 4,భద్రాచలం:** ఐటీడీఏ ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభించబోయే గిరి మాల్ట్ లో వివిధ పోస్టులలో పనిచేయడానికి ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఆదేశాల మేరకు వ్యాపార లావాదేవీలలో అవగాహన, అనుభవం గల వర్కర్లను ఎంపిక చేయడానికి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందని సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. బుధవారం నాడు ఐటిడిఏ ప్రాంగణంలోని వైటీసీలో త్వరలో ప్రారంభించబోయే గిరి మాల్ట్ లో ఇంటర్మీడియట్, ఆపైన విద్యార్హత గల మహిళలకు సేల్స్ అసోసియేట్, క్యాషియర్, స్టాక్ అసిస్టెంట్ పోస్టుల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహించగాభద్రాచలం లోనిస్థానికంగా ఉన్న15మంది యువతియువకులు హాజరయ్యారని అన్నారు. వారిని ఒక్కొక్కరిని పిలిచి వారి యొక్క అనుభవము మరియు అవగాహన ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు. ఆసక్తిగల యువతీ యువకులు ఈ పోస్టులలో పనిచేయడానికి ఇంకా ఎవరైనా ఉంటే ఐటీడీఏ కార్యాలయంలోని భవిత సెల్ నందు సంప్రదించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పివిటిజి అధికారి గన్యా, జేడీఎం హరికృష్ణ మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ తులసీరామ్ కుటుంబానికి భీమా సొమ్ము

### రూ.రెండు లక్షల చెక్ అందజేసిన పోస్టల్ అధికారులు



**టీ మీడియా,మార్చి04, సింగరేణి (కారేపల్లి):**సింగరేణి మండల పరిధిలోని బోటితండా గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్య తులసీరామ్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు.గతంలో పోస్ట్ ఆఫీస్ ద్వారా తన పేరు మీద పీఎంజేజేబివై ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోవడం జరిగింది.ఈ పాలసీ ద్వారా వచ్చిన భీమా మొత్తం రూ. 2 లక్షల కు సంబంధించిన చెక్కును బోటి తండా సర్పంచ్ బాదావత్ మంగీలాల్,జిల్లా పోస్టల్ సూపరిడెంట్ వీరభద్ర స్వామి చేతుల మీదుగా బుధవారం తులసీరామ్ సతీమణి విజయలక్ష్మికు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐపీఓ, ఎంఓలు, ఐపిపిబి మేనేజర్లు, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ సాయి, పోస్టల్ సిబ్బంది బి రామకృష్ణ, జి శరణ్, జె విజయ్ , యశ్వంత్, జవహర్, నవీన్, ప్రత్యూష , రమ్య గ్రామస్తులు పాల్గొన్నారు.



## కారేపల్లిలో హోలీ సందడి

**టీ మీడియా,మార్చి04, సింగరేణి (కారేపల్లి) :** కారేపల్లి మండలంలో గ్రామాల్లో హోలీ వేడుకలు సందడిగా సాగాయి. ప్రభుత్వం హోలీ సెలవు దినం మంగళవారం ప్రకటించినా ఆ రోజు చంద్రగ్రహణం కావటంతో పండుగ జరపలేదు. మండలంలోని గ్రామాల్లో బుధవారం హోలీ జరుపుకున్నారు. తండాలు హోలీ వేడుకలతో సందడి గా మారాయి. కారేపల్లిలో బీసీ కాలనీ, గొల్ల బజార్, యువకులు కారేపల్లి డప్పు వాయిద్యాలతో రంగులు చల్లుకుంటూ ఊరేగింపుగా హోలీ వేడుకను జరిపారు. యువకులు తమ సవాసగాళ్లను ఆటపట్టిస్తూ తలపై కోడి గ్రుడ్లు కొడుతూ, నల్లని తారు అయిల్ పూస్తూ అనందంతో నృత్యాలు చేశారు. వయసు, ఆడమగ, తారతమ్య బేధాలు పక్కన పెట్టి హోలీ జరుపుకున్నారు.



## యువకుడు పై కత్తితో దాడి... ముగ్గురు రిమాండ్

**టీ మీడియా, మార్చి 4 ,తిరుమలాయపాలెం:**పాత కక్షల నేపథ్యంలో యువకుడు పై దాడి చేసి గాయపరిచిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తిరుమలాయపాలెం మండలం బీరోలు గ్రామానికి చెందిన కుందూరు లాలు గా/శీ లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం మంగళవారం సాయంత్రం సుమారు 6:00 గంటల సమయంలో బీరోలు కమ్యూనిటీ హాల్ ముందు తన కొడుకు అయిన కుందూరు ఉదయ్ గా/శీ లాలు అను అతనిని డబ్బులు ఇచ్చే విషయంలో, అదే గ్రామానికి చెందిన వేరే వ్యక్తులతో తిరుగుతున్నాడు అన్న ఉద్దేశంతో, అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు అనగా 1.మిరియాల విక్రం రెడ్డి గా/శీ నరసయ్య 2. వేల్పుల లింగరాజు గా/శీ మల్సూర్ 3. కట్ల మహేష్ గా/శీ ఉప్పయ్య లు దాడిచేసి పదునైన కత్తితో పొడవగా రక్త గాయాలైనటువంటి ఉదయ్, ప్రాణాపాయ స్థితిలో ఉండగా ఖమ్మం నగరంలో కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించి, క్షేమజఖ లో చికిత్స చేయిస్తూ బుధవారం ఉదయం తన తండ్రి ఇచ్చిన పిటిషన్ మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై కూచిపూడి జగదీష్ జగదీష్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న కుందూరు ఉదయ్ యొక్క స్టేట్ మెంట్ రికార్డ్ చేసి దాడి చేసిన ముగ్గురు వ్యక్తుల్ని బుధవారం అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం కోర్టు నందు హాజరు పరిచినట్లు తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీష్ తెలిపారు.

## పనికి తగిన ప్రతిఫలం దక్కాలి

### సింగరేణి వీవోఏ ల నూతన సంఘం ఏర్పాటు

**టీ మీడియా,మార్చి04, సింగరేణి (కారేపల్లి):** గ్రామాలలో సంఘాల బలోపేతం, మహిళల అర్ధికాభివృద్ధికి కృషి చేస్తున్న గ్రామ సమాఖ్య సహాయకుల(వీవోఏ )కు పనికి తగిన ప్రతిఫలం దక్కటం లేదని వీవోఏల సంఘం మండల అధ్యక్షకార్యదర్శులు బొడ్డుపల్లి వసంత, ఈసం నాగమణి లు ఆవేదన వ్యక్తం చేశారు. బుదవారం కారేపల్లిలో సింగరేణి మండల వీవోఏ లు కొత్తగా సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సంఘం ద్వారా వీవోఏ ల సమస్యలు పరిష్కారంకు కృషి చేయటంతో పాటు సెర్ప్ ప్రాజెక్టు ద్వారా ఇచ్చే ఆదేశాలను వెంటనే అమలు చేయటానికి కృషి చేస్తామన్నారు. వీఏవో లకు ప్రభుత్వమే పూర్తి వేతనాలు చెల్లించాలని కోరారు. అనంతరం నూతన కమిటీ ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షురాలి గా బొడ్డుపల్లి వసంత, కార్యదర్శిగా ఈసం నాగమణి, కోశాధికారిగా చీకూర్తి సుజాత లను ఎన్నకున్నారు. అనంతరం సంఘ బాధ్యులు సింగరేణి మండల ఐకేపీ ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు కు వినతి ప్రతం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకురాళ్లు పీ.మమత, బీ.సింధుజ, వై.కళ్యాణి, పి.రమాదేవి, జీ.మోహన్, టీ.లలిత, కే.వెంకటేశ్వర్లు, కే.మంగతాయి, ఎన్.అనూష, సీహెచ్. లక్ష్మి. పీ.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## రజతోత్సవ వేడుకలను జయప్రదం చేయండి.

**టీ.మీడియా,మార్చి4,చింతూరు:** పోలవరం జిల్లా చింతూరు మండలం లోని రామన్నపాలెం గ్రామంలో గత 25 ఏళ్లుగా చదువు మధ్యలో మానివేసిన విద్యార్థులకు బ్రిడ్జి కోర్స్ లు నిర్వహించి తెలంగాణ జిల్లాల్లో




యువతకు విద్యా అవకాశాలు కల్పించిన కోయత్తోర్ బాట ఏర్పడి 25 సంవత్సరాలు అయింది. ఈ సందర్భంగా రజితోత్సవ వేడుకలను మార్చి 7వ తేదీ జరుపుకుంటుందని, ఈ కార్యక్రమంలో భాగంగా, విజ్జ, అలిం – బలిం కోటై, గాలి గాలి కుక్క అనే గిరిజన పుస్తకాలను ఆవిష్కరించనున్నట్లు కోయత్తోర్ బాట నిర్వాహకులు యాదయ్య, దుమ్మిరి భీమమ్మ, జల్లి మల్లయ్య తదితరులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి చింతూరు ఐటీడీఏ పీవో శుభంనొక్వాల్, తెలంగాణ రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర కన్వీనర్ సీడం అర్జు, వార్త దినపత్రిక పూర్వ సంపాదకులు టంకశాల అశోక్, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ శివప్రసాద్, సమత స్వచ్ఛంద సంస్థ రెబ్బ ప్రగడ రవి, కోయ రచయిత్రి పద్దం అనసూయ, ప్రత్యేక ఆహ్వానితులు ఆదిలాబాద్ జిల్లా కురిసింగ మోతీ రామ్, కోరంగ దౌలత్ రావు, శ్యామ్ రావు ఉయికే, ఏంవి ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వెంకటరెడ్డి, తెలుగు విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ పోట్ల బత్తిని మహేష్, ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ ప్రొఫెసర్ మల్లి భాస్కరరావు, ఐటిడిఎస్ పోలవరం అనిల్ కుమార్, దింసా పత్రిక ఎడిటర్ సైమన్ గుణవర్తి, హోమియో వైద్యులు అంబటి సురేంద్ర రాజు హాజరవుతున్నారని, కోయత్తోర్ బాట రజతోత్సవ వేడుకలు, పుస్తకాల ఆవిష్కరణకు, కోయ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువజన మిత్రులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

## సుభాష్ చంద్రబోస్ 10వ వర్ధంతి.

**-50 సంవత్సరాల అజ్ఞాతవాసం.**



**టీ మీడియా ,మార్చి 4 ,కొణిజర్ల** :మండల పరిధిలోని ఎల్లన్నగర్ గ్రామంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ గ్రామ కమిటీ కార్యదర్శి గండికోట రమేష్ అధ్యక్షతన కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ పదో వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ ఏర్పాటు చేశారు అనంతరం సభలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ వైరా డివిజన్ నాయకులు పాశం అప్పారావు మాట్లాడుతూ తెలంగాణ మట్టి మాగానాల్లో నుంచి ఖమ్మం జిల్లా పోరాట కౌగిళ్లలో నుంచి విప్లవశక్తి గా శ్రమించి అంకితమయ్యాడురాయల సుభాష్ చంద్రబోస్ అని పేర్కొన్నారు. 50 సంవత్సరాల అజ్ఞాత జీవితం గడిపి. విద్యార్థి ఉద్యమ పోరాట మైదానాలు నుంచి. అడవి పొత్తిళ్లలో ఎదిగి సాయదళపతిగా నిర్మాణ కర్తగా. సుమారు 26 సంవత్సరాలు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు అని గుర్తు చేశారు. సమాజంలో వివిధ రంగాల్లో వస్తున్న మార్పులు గురించి ఎప్పటికప్పుడు అధ్యయనం చేసేవాడు మారిన పరిస్థితులకు అనుగుణంగా మన ఎత్తుగడలను విధానాలను తగిన విధంగా ఎలా అభివృద్ధి చేసుకోవాలో మార్చుకోవాలో తీవ్రంగా ఆలోచించేవారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు గోగుల సోములు, గండికోట బాబు, రాపోలు కృష్ణ, గండికోట లక్ష్మణ్ , గోగుల వెంకన్న , గుగులోతు లాల్ సింగ్ ,ధరావతురాఫ్ సునీత, మారోని లాలి, మత్తు ఎత్తర రమేష్ ,కొంచెం రమేష్, ఆలకుంట శ్రీను, ఆలకుంట వెంకన్న,తదితరులు పాల్గొన్నారు.

## వెంకటరెడ్డి సేవలు మరువలేనివి.

పేర్కొన్నారు పార్టీలకతీతంగా అందరి అభిమాన నాయకుడిగా పేరు తెచ్చుకున్నారని గిరిజన తండాలలో లంబాడ వెంకన్నగా పేరుపొంది ఈ జిల్లాలో గతకాంగ్రెస్ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు పేదలకు అందే విధంగా కృషి చేశారని పోడు పట్టాలు ఇప్పించడమే కాకుండా ఇందిరమ్మ ఆదర్శ గ్రామాలలో అనేక మౌలిక సదుపాయాలు కల్పించారని ఈ సందర్భంగా పేర్కొన్నారు ప్రతి ఒక్కరు కూడా వారి ఆశయ సాధనకు కృషి చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి మాజీ ఎంపిటిసి సభ్యులు రాంరెడ్డి జగన్నాథరెడ్డిమాజీ డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్. పిఏసిఎస్ కొండాయిగూడెం మాజీ అధ్యక్షులు దనియాకుల హనుమంతరావు
జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్దినేని రమేష్ చౌదరినల్లమోతు లక్ష్మయ్య నాయకులు దేవుళ్ళ రామకృష్ణ ఇల్లందుమార్కెట్ కమిటీ డైరెక్టర్ మా లోతు భావు సింగ్ నల్లమోతు వెంకట నరసయ్య బొడ్డు లక్ష్మీనారాయణ తోటకూరి శివయ్య.ఎరుకల రమేష్, కొత్త లింగాల సర్పంచ్ శీను. వివిధ గ్రామాల సర్పంచులుతదితరుపాల్గొన్నారు.

## అంబులెన్స్ ల కోఆర్డినేటర్లతో సమావేశం

**టి మీడియా, మార్చి 4,భద్రాద్రి కొత్తగూడెం:** జిల్లా వైద్య , ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం, భద్రాద్రి కొత్తగూడెంజిల్లా కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ జిల్లాలోని 102, 108 అంబులెన్స్ వాహనాల కోఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో 102, 108 అంబులెన్స్ సేవలను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలను సురక్షిత ప్రసవాల కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. గ్రామీణ మరియు దూర ప్రాంతాల్లో కూడా వాహనాలు సమయానికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



## మహిళా సాధికారతతోనే ఉజ్వల భవిష్యత్తు

**- ఎంటర్ప్రెన్యూర్షిప్ ప్రోగ్రాం ప్రారంభం.**

**టీ మీడియా , మార్చి 4, కొణిజర్ల :**స్థానిక తెలంగాణ గిరిజన సంక్షేమ నివాస మహిళా డిగ్రీ కళాశాలలో 'మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో 20 రోజుల పాటు సాగే ఎంటర్ప్రెన్యూర్షిప్ శిక్షణ కార్యక్రమం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. విద్యార్థినులను స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించారు.ఈ సందర్భంగా శిక్షకురాలు సుజాత తాటి ఆకులతో బుట్టలు, బొకేలు, అందమైన మాలల తయారీపై విద్యార్థినులకు ప్రత్యక్ష అవగాహన కల్పించారు. అనంతరం సత్యమార్గం ఫౌండేషన్ అధ్యక్షురాలు శ్రీలక్ష్మి మాట్లాడుతూ స్వంతంగా వ్యాపారాలు ప్రారంభించాలనుకునే విద్యార్థినులకు తమ ఫౌండేషన్ ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆధునిక కాలంలో మహిళలు కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా, వ్యాపారవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు.
కళాశాల ప్రిన్సిపాల్ కె. రజని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ వైస్ ప్రిన్సిపాల్ ఎం. నవ్య, ఎంటర్ప్రెన్యూర్షిప్ కో-ఆర్డినేటర్లు టి. సారిక, పి. శ్రావణి మరియు ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు. ఈ శిక్షణ తమలో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి విజేత, జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ (మహిళా హబ్) సమ్రీన్, సత్యమార్గం ఫౌండేషన్ అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, సభ్యురాలు అనిత, మరియు శిక్షకురాలు సుజాత విచ్చేశారు.



## పోలీసు హెడ్ క్వార్టర్స్ లో హోలీ వేడుకలు

**టి మీడియా, మార్చి 4,భద్రాద్రి కొత్తగూడెం:**జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు.జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.ముందుగా జిల్లా పోలీస్ అధికారులంతా కలిసి ఎస్పీ క్యాంప్ కార్యాలయానికి వెళ్లి హోలీ వేడుకలకు ఎస్పీ రోహిత్ రాజును ఆహ్వానించారు.అక్కడ అధికారులు,సిబ్బంది రంగులు చల్లుకుంటూ సందడి చేశారు.అనంతరం ఎస్పీతో కలిసి అధికారులంతా హేమచంద్రాపురం నందు గల పోలీస్ హెడ్ క్వార్టర్స్ నకు చేసుకుని పోలీస్ బ్యాండ్ చప్పుళ్లకు నృత్యాలు చేశారు.జిల్లా పోలీసు అధికారులు,సిబ్బంది హెడ్ క్వార్టర్స్ నందు ఆనందోత్సవాల మధ్య కేరింతలతో హోలీ వేడుకలను జరుపుకున్నారు.ఈ ఉత్సవాల్లో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్,కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ,పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్,మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి,ఇల్లందు డిఎస్పీ వెంకన్న బాబు మరియు సీఐలు,ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎంఆర్ రైస్ రీలో ఇబ్బందులు లేకుండా చర్యలు...

**-అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**

**టీ మీడియా,మార్చి4, ఖమ్మం:**సీఎంఆర్ రైస్ డెలివరీలో ఇబ్బందులు లేకుండా చర్యలు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తెలిపారు.అదనపు కలెక్టర్, కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం సీఎంఆర్ రైస్ డెలివరీ పై గోడౌన్ మేనేజర్ లు, ఎం.ఎల్.ఎస్. పాయింట్ ఇంచార్జి లతో సమావేశం నిర్వహించారు.అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూలి రైస్ మిల్లర్లు ఎస్.డబ్ల్యూ.సి. లకు సరఫరా చేసే ఏసికే సకాలంలో దింపేందుకు అవసరమైన మేర హామాలీ లను ఏర్పాటు చేయాలని అన్నారు. సిఎంఆర్ రైస్ డెలివరీ ఆలస్యం కాకుండా రైస్ మిల్లర్లకు పూర్తిస్థాయిలో సహకరించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, జిల్లా రైస్ మిల్ సంఘం అధ్యక్షులు బొమ్మ రాజేశ్వరరావు, గోడౌన్ మేనేజర్ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

